వ్యాధుల కాలం.. అప్రమత్తతే ఆయుధం

- పెరుగుతున్న జ్వరపీడితులు
- అప్రమత్తమైన అధికారులు
- పారిశుధ్య పనులకు ప్రాధాన్యం


నిడదవోలులో ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు

నిడదవోలు: పల్లెల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. వాన, ఎండల కారణంగా వాతావరణ మార్పులతో జ్వరం, జలుబు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. నిడదవోలు, కొవ్వూరు, తణుకు ప్రభుత్వాసుపత్రులకు రోజుకు సుమారు 450 మంది వరకూ రోగులు జ్వరం, జలుబుతో వస్తున్నారు. సుమారు 70 నుంచి వంద మంది వరకు రోగులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. వీరే కాకుండా ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లకు రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటోంది. ఈ సీజన్‌లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికెన్ గన్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

ఇంటింటికీ వెళ్లి అవగాహన

గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇళ్ల చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉండేలా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత శుభ్రత అవసరమని అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా వ్యాధుల బారి నుంచి రక్షించుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా పంచాయతీలకు సూచనలు ఇస్తున్నారు. నిడదవోలు పట్టణంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, ఆయా మండలాల్లో ఎంపీడీఓల పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రై డేను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. నిడదవోలులోని ప్రతి వార్డులో పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలు శుభ్రపరచడం, మురుగునీరు ఉన్నచోట క్లోరినేషన్ చేస్తున్నారు. వానలు పడే సమయంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా రోగాల బారిన పడుతున్న వారి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా వైద్యం అందించి మందులు పంపిణీ చేస్తున్నారు. టైఫాయిడ్‌తో పాటు డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకరమని వైద్యులు చెబుతున్నారు.

అందుబాటులో వైద్య సేవలు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు 250 నుంచి 300 వరకూ ఓపీ ఉంటుంది. ఇందులో 70 శాతం వరకూ జ్వరాల బారిన పడిన వారే వస్తున్నారు.


నిడదవోలు ఎస్టీ కాలనీ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రస్తుతం 8 మంది వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. పట్టణంలోని రెండు అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యులు నిరంతరం సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా ఉండ్రాజవరం, పెరవలి, కానూరు, తాడిమళ్ల, సమిశ్రగూడెం పీహెచ్‌సీలలో ఇద్దరు చొప్పున వైద్యులు అందుబాటులో ఉన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో టైర్లు, డ్రమ్ములలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. తద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చు.
- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. మలమూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రం చేసుకోవాలి.
- చిన్న పిల్లల ఒంటిని పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు వేయాలి. ఇళ్లలో దోమ తెరలు, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ఫీవర్ సర్వే చేస్తున్నాం..



రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుంటే స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలి. ఆస్పత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్య సిబ్బందితో పాటు వలంటీర్లు ఫీవర్ సర్వే చేస్తున్నారు. రక్త నమూనాలను సేకరించి వాటిని పరిశీలించిన అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను అందిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ కాచి చల్లార్చిన నీరు తాగాలి.

–జి.హేనా, వైద్యాధికారి,
అర్బన్ హెల్త్ సెంటర్, నిడదవోలు

మానవత సంస్థకు రూ.50 వేల విరాళం


మానవత సంస్థకు విరాళ చెక్కును అందజేస్తున్న పాతూరి సత్యనారాయణ

నల్లజర్ల: మండల మానవత స్వచ్ఛంద సంస్థకు ప్రవాస భారతీయుడు రూ.50 వేలు విరాళంగా అందించినట్లు మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు తెలిపారు. అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన మానవత డైరెక్టర్ పాతూరి సత్యనారాయణ కుమారుడు హరనాథ్, అతని భార్య లక్ష్మీసౌజన్యలు అమెరికాలో ఉంటున్నారు. వారి కుమారుడి పుట్టినరోజు సందర్భంగా సోమవారం మానవత సంస్థకు రూ.50 వేలు విరాళంగా పంపారు. ఆ చెక్కును మానవత కమిటీ సభ్యులకు పాతూరి సత్యనారాయణ అందించారు. మానవత సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, సభ్యులు ఉన్నమట్ల వెంకటేశ్వరావు, ఎస్.రాజేంద్రప్రసాద్, ఉప్పాడ కామేశ్వరావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: మహిళకు గాయాలు

నల్లజర్ల: బయ్యన్నగూడెం నుంచి తాడేపల్లిగూడేనికి ఇంటి సామగ్రి తీసుకువెళ్తున్న ట్రక్ ఆటో బోల్తా పడిన సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఆటో పోతవరం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి బోల్తా పడింది. డ్రైవరు పక్కన కూర్చున్న చప్పిడి ధనలక్ష్మికి తలకి తీవ్ర గాయమైంది. ఆటోడ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

క్లుప్తంగా

భవితకు బాటలు వేయాలి

గోపాలపురం: ఉపాధ్యాయులు విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయాలని ఎంఈఓ జి.శ్రీనివాసరావు అన్నారు. గోపాలపురం శర్వాణి హైస్కూల్ డైరెక్టర్ జంగా తిలక్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం గోపాలపురం జోన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. జిల్లా అపుస్మా అధ్యక్షుడు నందిగం భాస్కర రామయ్య, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పి.రవిచంద్ర, అంబటి శ్రీనివాసరావు, శర్వాణి స్కూల్ ప్రిన్సిపాల్ రాపాక ఫణికిషోర్ పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

కొత్త పింఛన్ల పంపిణీ


ప్రక్కిలంకలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ స్వప్న

తాళ్లపూడి: ప్రక్కిలంక సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ యాళ్ల స్వప్న సోమవారం పంపిణీ చేశారు. మొత్తం 16 మందికి పింఛన్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. హోం మంత్రి తానేటి వనిత ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తామన్నారు. నాయకులు యాళ్ల బాబూరావు, కె.దుర్గారావు, రాజు, వెంకటరావు, వెంపా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

12న వాహనాల వేలం

కొవ్వూరు: సారా, ఇతర నేరాల్లో పట్టుబడిన మోటారు సైకిళ్లకు ఈ నెల 12న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరులోని తమ కార్యాలయంలో ఉదయం పది గంటలకు వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొన దలచినవారు రూ.5 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. ఆధార్ కార్డు జిరాక్సు సమర్పించాలన్నారు.

గోపాలపురం ఎస్సైగా సతీష్‌కుమార్


ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తున్న సతీష్‌కుమార్

గోపాలపురం: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా కె.సతీష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. టి.నర్సాపురం ఎస్సైగా పనిచేసి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై కె.రామకృష్ణను వీఆర్ నుంచి రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సతీష్‌కుమార్ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మండల కోఆప్షన్ సభ్యుడిగా మునాఫ్


సయ్యద్ మునాఫ్‌ను అభినందిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు

నల్లజర్ల: స్థానిక మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా దూబచర్లకు చెందిన సయ్యద్ మునాఫ్ ఎంపికయ్యారు. సోమవారం ఆయనతో మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ కృష్ణారావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఇంతవరకూ కోఆప్షన్ సభ్యుడిగా ఉన్న సయ్యద్ మస్తాన్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుమారుడు సయ్యద్ మునాఫ్‌ను ఈ పదవికి ఎంపిక చేశారు. ఆయన్ని ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ సభ్యులు మేడ్ని వెంకటలక్ష్మి, యలమర్తి సూర్యకుమారి, వామిశెట్టి పావనీకుమారి, చోడసాని సునీత తదితరులు అభినందించారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోండి


కొవ్వూరులో డీఎస్పీ వర్మకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: పట్టణంలో విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సోమవారం డీఎస్పీ వీఎస్ఎన్ వర్మకు ఫిర్యాదు చేశారు. బైక్‌లపై వచ్చి మహిళలు, యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. మద్యం, గంజాయి మత్తులో మితిమీరిన వేగంలో బైక్‌లు నడుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు బీవీ ముత్యాలరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మాట్లా ఆంజనేయులు, ప్రవాస్ యోజన కన్వీనర్ బూసి సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- పెండ్యాలలో గడప గడపకూ..


పెండ్యాలలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సోమవారం పెండ్యాల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కారింకి అన్నవరం, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో నాలుగున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన అందిస్తున్నారు. ఉచిత ఇసుక పేరిట దందా చేసి గతంలో టీడీపీ నాయకులు రూ.కోట్లు సంపాదించారని విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే టీడీపీ, జనసేన నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పాలన, ఇంటింటికే సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, జేసీఎస్ కన్వీనర్ వెలగన పోలయ్య, ఉప సర్పంచ్ బైర్రాజు సత్యరాజు, నాయుడు సత్యనారాయణ, పేరిచర్ల నాగరాజు, వాకా సూర్యనారాయణ, సరిపల్లి నూకరాజు, కొండేటి అశోక్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కలసికట్టుగా పనిచేయండి

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లు ఉప సర్పంచ్‌గా మేకా రాజు


చాగల్లు ఉప సర్పంచ్ మేకా రాజుకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న మంత్రి తానేటి వనిత, అధికారులు

చాగల్లు: గ్రామాభివృద్ధికి అంతా కలసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. చాగల్లు పంచాయతీలో ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మేకా రాజు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులంతా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ప్రతి నెలా ఒకసారి సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యల పరిష్కారానికి బాటలు వేయాలని సూచించారు. చాగల్లు పంచాయతీలో మొత్తం 20 వార్డుల్లో 17 మంది వార్డు సభ్యులు అధికార పార్టీ మద్దతుదారులేనని అన్నారు. ఉప సర్పంచ్ పదవి రెండున్నరేళ్ల పాటు అనుకున్న ఒప్పందంలో భాగంగా ఇప్పటి వరకూ బాధ్యతలు నిర్వర్తించిన ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్ రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ ఉప ఎన్నిక వచ్చినట్లు ఆమె తెలిపారు. ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మేకా రాజుకు నియామక ధ్రువపత్రాన్ని ఎన్నికల అధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ అందజేశారు. అనంతరం రాజు ప్రమాణస్వీకారం చేశారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి తదితరులు పాల్గొన్నారు.

- తొలుత ఉప సర్పంచ్ పదవికి ఎన్నికల అధికారి ఆర్.శ్రావణ్ కుమార్ ఎన్నికలు నిర్వహించారు. రాజు అభ్యర్థిత్వాన్ని 9వ వార్డు సభ్యులైన కసిరెడ్డి సతీష్‌కుమార్ ప్రతిపాదించగా, పదో వార్డు సభ్యులైన షేక్ జరీనా భాను బలపరిచారు. అనంతరం సభ్యులంతా ఆమోదించడంతో రాజు ఎన్నికైనట్లు శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చివటం ఉప సర్పంచ్‌గా 'తప్పిట్ల'

ఉండ్రాజవరం: చివటం గ్రామ ఉప సర్పంచ్‌గా తప్పిట్ల నాగ రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ ఎన్నికల్లో ఒప్పందం ప్రకారం ఇప్పటి వరకూ ఉప సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన కూనపరెడ్డి పాండురంగ రాజీనామా చేయడంతో రవికుమార్‌ను ఎన్నుకున్నారు. సభ్యుల ఆమోదంతో ఎన్నికల అధికారి కె.శ్రీనివాసు ఉప సర్పంచ్ అభ్యర్థి తప్పిట్ల రవికుమార్‌కు నియామక పత్రం అందజేశారు. సర్పంచ్ ఈడ్పుగంటి సత్యనారాయణ, సమత యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం జరిగింది. ఇప్పటి వరకూ ఉప సర్పంచ్‌గా ఉన్న గోలి అన్నవరం ఒప్పందం గడువు పూర్తి కావడంతో సర్పంచ్ నక్కా అనురాధ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఉప సర్పంచ్‌ను ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో అప్పన జగదీష్‌ను ఉప సర్పంచ్‌గా వార్డు సభ్యులు ఎన్నుకున్నారు.

సమాజంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర



కొవ్వూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: సమాజ అభ్యున్నతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. సోమవారం స్థానిక లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో పాఠశాలలు, అన్ ఎయిడెట్ పాఠశాలల అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో గురు పూజోత్సవంలో ఆమె పాల్గొన్నారు. జోన్ పరిధిలో ఎంపిక చేసిన నలభై మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ప్రభుత్వం అమ్మ ఒడి పథకం వర్తింపజేయడం హర్షణీయమని మంత్రి అన్నారు. విద్యా వ్యవస్థలో జగనన్న విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు ప్రదానం చేయాలని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను మంచి మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రైవేట్ టీచర్లకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని అపుస్మా సంఘ నాయకులు కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యా సంస్థల ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కొవ్వూరు జోన్ చైర్మన్ నెల్సన్ ఆంటోనీ, కన్వీనర్ కేఎస్ ధనరాజు కుమార్ (రాజు), కోశాధికారి వీవీ అనీష్, ఉపాధ్యక్షుడు బి.రమేష్, సలహాదారులు ఎం.ప్రవీణ్‌కుమార్, వీవీ రామారావు, పి.రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ పురస్కారాలకు ఎంపిక


విమల


సుహాసిని


ఆచంట విజయ

నల్లజర్ల/పెరవలి: మారెళ్లమూడి యూపీ స్కూల్ ఉపాధ్యాయిని శెట్టే విమల జిల్లా ఉత్తమ పురస్కారానికి ఎంపికైనట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. 21 ఏళ్లుగా స్కూల్ అసిస్టెంట్‌గా ఆమె పని చేస్తున్నారు. పోతవరం హైస్కూల్లో ఏడేళ్లు హెచ్ఎంగా వ్యవహరించారు. అక్కడ రూ.61 లక్షలతో నాడు–నేడు పనులు సమర్థవంతంగా నిర్వహించారు. అలాగే దూబచర్ల ప్రాథమిక పాఠశాల–1లో ఉపాధ్యాయిని సిరివెళ్ల సుహాసిని జిల్లా ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆమె భర్త ప్రసాద్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. తన పిల్లల మాదిరిగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు ఆమె తెలిపారు. పెరవలి మండలం ముత్యాలవారిపాలెంలో ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆచంట విజయ జిల్లా పురస్కారానికి ఎంపికయ్యారు. మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగే గురుపూజోత్సవంలో కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

మండల స్కూల్ గేమ్స్ ఎంపికలు

నల్లజర్ల: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు ఈ నెల 8, 9 తేదీలలో నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరుగుతాయని ఎంఈఓ వై.సత్యనారాయణ, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పల్లివెంకట అప్పారావు తెలిపారు. మొదటి రోజు అథ్లెటిక్స్, రెండో రోజు గేమ్స్‌లో సెలక్షన్స్ ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 96668 08054 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

కొవ్వూరు: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త ఎస్.నాగరాజు తెలిపారు. ఈ నెల 7, 8, 11 తేదీల్లో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన క్రీడాకారులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్– 14, 17 విభాగాల్లో బాల, బాలికలకు కబడ్డీ, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, యోగా, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ ఆటల్లో పోటీలు ఆయా మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 14, 15, 16 తేదీల్లో కొవ్వూరులో నియోజకవర్గ స్థాయి పోటీలు ఉంటాయన్నారు.

గణపతి ఉత్సవాలకు శ్రీకారం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిబాబు

నిడదవోలు: స్థానిక గణేష్‌చౌక్ సెంటర్‌లోని శ్రీపూజ గణపతి, కుమారస్వామి వార్ల ఆలయంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలకు సోమవారం ఉదయం రాట ముహూర్తం జరిగింది. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు పురపాలక సంఘం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సై పి.నాగరాజు, కౌన్సిలర్లు కారంకి నాగేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి సుప్రియ, తోలేటి ఝాన్సీరాణి, షాకిరా బేగం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు పరామర్శ

నిడదవోలు రూరల్: కోరుమామిడి సొసైటీ అధ్యక్షుడు వింతా గంగాధరరెడ్డి సోదరుడు రఘురెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సోమవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముళ్లపూడి శ్రీరామమూర్తి, సీతామహాలక్ష్మి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. పార్టీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, నాయకులు కె.శేషు, రాపాక వెంకట్రావు పాల్గొన్నారు.

రిక్షా స్టాండ్ ఏర్పాటు చేయండి

నిడదవోలు: నిడదవోలు– యర్నగూడెం రోడ్డులో కాపు కల్యాణ మండపం వద్ద సోమవారం ఆదర్శ ప్లాట్‌ఫారం రిక్షా వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని యూనియన్ అధ్యక్షుడు కోనేటి మల్లేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు పిచ్చా సూర్యకిరణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ ప్లాట్ రిక్షా కార్మికులకు ఒక షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. యూనియన్ నాయకులు బంకపల్లి నాగేశ్వరరావు, లంకాడ గణపతి, ప్రకాశం, అడబాల రమణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి


గోపవరంలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, నాయకులు

నిడదవోలు రూరల్: గ్రామాల్లో సచివాలయ, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. గోపవరంలో నిర్మాణంలో ఉన్న భవనాలను, అంగన్వాడీ, పాఠశాలలను సోమవారం ఆమె పరిశీలించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి ఎంపీపీ చేశారు. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్డ మురళీకృష్ణ, తాతపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


బ్యాంక్ ఆఫ్ బరోడా భవనం ప్రారంభోత్సవంలో జోనల్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు

కొవ్వూరు: ముప్పై ఏడేళ్లుగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తుందని, రూ.100 కోట్ల మేరకు వివిధ వర్గాలకు రుణాలు అందించామని ఆ బ్యాంకు విశాఖపట్నం జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వాడపల్లి గ్రామంలో కొత్తగా ఆధునీకరించిన బ్యాంకు భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎస్.జేజేశ్వరరావు అన్నారు. బ్యాంకు సేవలు, రుణాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, బ్యాంక్ మేనేజర్ ఫణీంద్రకుమార్, బ్యాంకు యూనియన్ ప్రతినిధులు రవిశంకర్, వీటీ శాంచి, తోట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.